క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

చీపురుపల్లి: ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారికి కేటాయించేందుకు గాను అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ ఎం.బూసినాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 – 26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రైవేట్, అన్ఎయిడెడ్ పాఠశాలలో ఒకటో తరగతిలో ప్రవేశాలకు ఆగస్టు 20లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్లైన్లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఆగస్టు 25న లాటరీ ద్వారా సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులకు సమీపంలోని 5 కిలోమీటర్ల లోపు పరిధిలోని ప్రైవేట్ పాఠశాలలను కేటాయిస్తామన్నారు.

ప్రహరీ పనుల అడ్డగింత



ప్రహరీ పనులను పరిశీలిస్తున్న పీహెచ్సీ వైద్యాధికారి సీతల్వర్మ

కొత్తవలస: మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించి ప్రహరీ నిర్మాణ పనులను కొంతమంది స్థానికులు అడ్డుకున్నారు. దీంతో ఆర్అండ్బీ జేఈ ఎల్లమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జేఈ తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి.. 'నాడు – నేడు' కింద గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం పీహెచ్సీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. దీంతో ఆస్పత్రి భవనం శ్లాబ్వరకు పనులు జరిగాయి. ప్రస్తుతం ప్రహరీ నిర్మాణానికి పునాదులు తీస్తుండగా.. కొంతమంది స్థానికులు వచ్చి పనులను గురువారం అడ్డుకున్నారు. ఆ స్థలం తమదంటూ దౌర్జన్యానికి దిగడంతో జేఈ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పనులను పీహెచ్సీ వైద్యాధికారి సీతల్వర్మ పర్యవేక్షించారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు



భోజనాన్ని పరిశీలిస్తున్న ఏఎంఓ కృష్ణవేణి

గంట్యాడ: పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని జోన్ – 1 అకడమిక్ అధికారి (ఏఎంఓ) కృష్ణవేణి అన్నారు. మండలంలోని మదనాపురం మోడల్ స్కూల్ను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. జేఈఈ, నీట్, ఈఏపీసీఈటీ, ఎన్ఎంఎంఎస్ తరగతులు ఎలా జరుగుతున్నదీ ఆరా తీశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కృష్ణాలయం వార్షికోత్సవాలు



విశేషాలంకరణలో దర్శనమిస్తున్న గోపాలకృష్ణ

వేపాడ: మండల కేంద్రంలోని రుక్మిణీ సత్యభామ సమేత గోపాల కృష్ణాలయం వార్షికోత్సవాలను శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు గోపాలకృష్ణ యాదవ సంఘ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 16న కృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు, ఉట్టికొట్టడం నిర్వహిస్తామన్నారు. 17న రుక్మిణీ సత్యభామ సమేత గోపాలకృష్ణ కల్యాణం నిర్వహిస్తామని చెప్పారు. మధ్యాహ్నం అన్నదానం.. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

అన్నదాతకు ఎరువు కరువు..

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుకు దొరకని ఎరువులు
- టీడీపీ వర్గీయులకే ఇష్టారాజ్యంగా ఎరువులు పంపిణీ చేస్తున్న వైనం
- గత వైఎస్సార్సీపీ హయాంలో ఏడాదికి 600 మెట్రిక్టన్నులు పంపిణీ
- కూటమి ప్రభుత్వం హయాంలో ఈ ఏడాది ఇప్పటివరకూ 171 మెట్రిక్ టన్నుల పంపిణీ



పీఏసీఎస్ వద్ద ఎరువులు కోసం క్యూలో ఉన్న రైతులు (ఫైల్)



ఎలాంటి ఎరువులు పంపిణీ చేయకపోవడంతో మూసి ఉన్న గరుగుబిల్లి రైతుసేవా కేంద్రం

మెరకముడిదాం: అందరికీ అన్నంపెట్టేందుకు అన్నదాత ఆరుగాలం కష్టపడి సాగుచేస్తున్న వరి పంటకు అవసరమైన ఎరువులను అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ఎందుకంటే రైతుకు కావాల్సిన ఎరువులను ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వైఎస్సార్సీపీ అధికారంలో ఉన్నప్పుడు రైతులు ఇబ్బంది పడకుండా వారికి రైతుభరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచారు. ఆర్బీకేల్లో ఉన్న విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ ద్వారా రైతులకు ఏయే ఎరువులు, ఎంతెంత కావాలో ముందుగానే ప్రభుత్వానికి నివేదికలు వెళ్లేవి. దీంతో ప్రభుత్వం ఒక్కో ప్రాంతానికి ఎంత ఎరువులు కావాలో పంపించేది. దీంతో గత ఐదేళ్లు ఒక్క రైతు కూడా ఎరువులు, విత్తనాల కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా పోయింది. అన్నదాతకు ఎంతో అండగా ఉండే ఆర్బీకేలను కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. దీంతో రైతులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయ, సౌకర్యాలు అందడం లేదు. గత వైఎస్సార్సీపీ హయాంలో మెరకముడిదాం మండలానికి ఏడాదికి 600 మెట్రిక్ టన్నుల ఎరువులు పంపిణీ చేయగా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ ఏడాది ఇంతవరకు 171 మెట్రిక్ టన్నుల ఎరువులు మాత్రమే పంపిణీ చేసింది. మండలంలో ఉన్న రైతులకు సరిపడా ఎరువులు పంపిణీ చేయలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో రైతులు చేసేది లేక ప్రైవేట్ డీలర్ల వద్ద ఎంఆర్పీ కంటే అధిక మొత్తం చెల్లించి ఎరువులు కొనుగోలు చేసుకుంటున్నారు. ఇదిలా ఉంటే వచ్చిన ఈ అరకొర ఎరువులను కూడా మండలానికి చెందిన టీడీపీ నాయకులు తమకు నచ్చిన వారికి మాత్రమే పంపిణీ చేస్తున్నారు. మండలంలోని చినబంటుపల్లి, శ్యామాయవలస, బిళ్లలవలస గ్రామాల్లో ఎరువుల పంపిణీ ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఆయా గ్రామాల్లో ఎంతోమంది రైతులున్నా.. కేవలం టీడీపీ మద్దతుదారులకు మాత్రమే ఎరువులు అందాయి. దీనిపై వ్యవసాయ శాఖాధికారులను రైతులు ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పుకోలేక తప్పించుకుతిరుగుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు కల్పించుకుని ఎరువులను అందరి రైతులకు సక్రమంగా పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చీపురుపల్లిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



జాతీయ జెండాలు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్పీ, సీఐ

చీపురుపల్లి: బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ మన్నెపురి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ప్రాముఖ్యతను పలువురు వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎస్. రాఘవులు, సీఐ జి.శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈ రహదారులకు మోక్షమెప్పుడో..



అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి పట్టణంలోని పలు రహదారులు ప్రమాదకరంగా మారాయి. ఏ మాత్రం ఆదమరిచి ఉన్నా ప్రమాదం తప్పదు. ఇప్పటికే ఎంతోమంది ఈ రహదారుల్లో పడి క్షతగాత్రులయ్యారు. గరివిడి పట్టణంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద వైపున రైల్వే ట్రాక్కు రెండు వైపుల ఉన్న తారురోడ్లు గోతులతో అస్తవ్యస్తంగా మారాయి. ఈ ప్రాంతంలో ఎక్కువగా వ్యాపార సముదాయాలు ఉండడంతో ఈ రోడ్ల మీదుగానే ఎక్కువగా రాకపోకలు జరుగుతుంటాయి. అంతే కాకుండా ఫేకర్ పరిశ్రమకు రాకపోకలు సాగించే భారీ వాహనాలు కూడా నిత్యం ఈ రోడ్ల మీదుగానే వెళ్తుంటాయి. దీంతో ఈ రోడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షాకాలంలో రోడ్డు ఎక్కడుందో, గొయ్యిలు ఎక్కడున్నాయో తెలియక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు



రాచగుమడాంలో కూటమి మోసాలను వివరిస్తున్న వైఎస్సార్సీపీ నాయకులు

మెరకముడిదాం: ముఖ్యమంత్రి చంద్రబాబును మోసానికి బ్రాండ్ అంబాసిడర్గా చెప్పవచ్చని వైఎస్సార్సీపీ నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, బూర్లె నరేష్కుమార్, పప్పల కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని రాచగుమడాం గ్రామంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలను ప్రజలకు వివరించారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేని వారికి పాలించే హక్కు లేదన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని కూటమి నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పి.శ్రీనివాసరాజు, పి.రామశివ, శంకరరావు, కృష్ణమూర్తిరాజు, మజ్జి జనార్దన, అల్లూరి కనకరాజు, శంకరరావు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలకు చెక్

సాక్షి ఎఫెక్ట్...

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని కోనూరు సబ్స్టేషన్ పరిధిలో గల గ్రామాల్లో తలెత్తిన విద్యుత్ సమస్యలకు సంబంధిత అధికారులు పరిష్కారం చూపారు. అర్తమూరులో విద్యుత్ కోతలు శీర్షికన సాక్షిలో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు ఏపీఈపీడీఈసీఎల్ ఏఈ సన్యాసిరావు ఆధ్వర్యంలో విద్యుత్శాఖ సిబ్బంది కోనూరు సబ్స్టేషన్లో ఉన్న ఓవర్ లోడ్ను తగ్గించేలా చర్యలు చేపట్టి అర్తమూరులో విద్యుత్ కోతలకు చెక్ పెట్టారు. ఈ సందర్భంగా ఏఈ సన్యాసిరావు మాట్లాడుతూ.. కోనూరు సబ్స్టేషన్ నుంచి ఎక్కువ గ్రామాలకు విద్యుత్ సరఫరా జరగడం వల్ల ఓవర్లోడ్ కారణంగా తరుచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. దీంతో లోడ్ను ఇతర ఫీడర్లకు సర్దుబాటు చేశామని తెలిపారు.

ప్రమాదకరంగా గనివాడ రోడ్డు



మల్లివీడు గ్రామం సమీపంలో రోడ్డ మధ్య కూలిపోయిన కల్వర్టు

లక్కవరపుకోట: మండలంలోని అరుకు – విశాఖ జాతీయ రహదారి నుంచి మల్లివీడు మీదుగా గనివాడ వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు అత్యంత ప్రమాదకరంగా మారింది. మల్లివీడు గ్రామ సమీపంలో రోడ్డు మధ్యలో కల్వర్టు కూలిపోవడంతో పెద్ద గొయ్యి ఏర్పడింది. ఈ గొయ్యిలో పడి ఇప్పటికే పలువురు గాయాలపాలయ్యారు. ఈ రోడ్డు మీదుగా గనివాడ, నిడుగట్టు.. కొత్తవలస మండల కంటకాపల్లి, కొత్తూరు, తదితర గ్రామాలకు ఈ రోడ్డు మీదుగానే ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఉచిత సీట్ల భర్తీకి చర్యలు



నోటిఫికేషన్ అతికించిన ఎంఈఓ బాలభాస్కరరావు, తదితరులు

వేపాడ: ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత సీట్ల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈఓ బాలభాస్కరరావు అన్నారు. ఈమేరకు రాష్ట్ర పథక సంచాలకుడు జారీ చేసిన జీఓను గురువారం స్థానిక ఎంఆర్సీ కార్యాలయం నోటీస్బోర్డులో అతికించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల వారికి 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని కోరారు.

ఆర్ఎస్కేల్లో ఎరువులు నిల్

దత్తిరాజేరు: మండలంలోని మరడాం, వి. కృష్ణాపురం, పెదమానాపురం రైతుసేవా కేంద్రాలలో ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. జూన్ నెల నుంచి నిల్వలు ఉండాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో రైతులకు ఎరువులు ఇంతవరకు అందలేదు. ప్రస్తుతం యూరియా, డీఏపీ అవసరం కాగా.. అన్నదాతకు ఎరువులు అందించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతులకు ఎరువులు అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గెలిపించినందుకు బాగానే బుద్ధి చెప్పారు



నిరసన తెలియజేస్తున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట: ఓట్లేసి గెలిపించినందుకు బాగానే బుద్ధి చెప్పారని జిందాల్ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. ముషిడిపల్లి పంచాయతీలో శ్రీసాయిసేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న క్యాన్సర్ ఆస్పత్రికి గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ భరత్, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాల్గొన్నారు. అయితే తమ గోడు చెప్పుకునేందుకు ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసేందుకు రాగా పోలీసులు అడ్డుకున్నారని బాధితులు వాపోయారు. ఈ మేరకు నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేశారు. జిందాల్ యాజమాన్యం మోచేతి నీళ్లు తాగుతూ వారికి కొమ్ముకాస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసులకు భయపడమని.. న్యాయం జరిగేవరకు పోరాడతామని బాధితులు స్పష్టం చేశారు.

అంగన్వాడీ కేంద్రాల సందర్శన



అంగన్వాడీ సెంటర్ను పరిశీలిస్తున్న పీడీ విమలారాణి

బొండపల్లి: మండలంలోని అంబటివలసలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి. విమలారాణి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లల వర్క్బుక్స్ చూసి ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే స్టాక్ రిజిస్టర్లను పరిశీలించడంతో పాటు చిన్నారుల బరువులను తూశారు. కార్యక్రమంలో గంట్యాడ సెక్టార్ సీడీపీఓ ఉమాభారతి, తదితరులు పాల్గొన్నారు.

సత్కారం



పోలీస్ ఉద్యోగాలకు ఎంపికైన వారిని సత్కరిస్తున్న డీఎస్పీ, సీఐ, తదితరులు

చీపురుపల్లి: ఇటీవల పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన వారికి ఘన సత్కారం లభించింది. పట్టణానికి చెందిన ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి కంది హేమంత్ నేతృత్వంలో నిర్వహిస్తున్న రన్ మిషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొంది పోలీస్ ఉద్యోగాలు సాధించిన వారికి గురువారం స్థానిక జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సత్కరించారు. ఈ సందర్భంగా హాజరైన డీఎస్పీ ఎస్.రాఘవులు, సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.శంకరరావు, పౌరసరఫరాల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గద్దే బాబూరావు వారిని సత్కరించి, అభినందించారు. అలాగే రన్ మిషన్ సంస్థ ద్వారా యువతను ఉద్యోగులుగా తీర్చిదిద్దుతున్న కంది హేమంత్ను కూడా సత్కరించారు.

కూటమివి కక్షపూరిత రాజకీయాలు

విజయనగరం: కూటమి కక్షపూరిత రాజకీయాలు చేస్తోందని, ఇది తగదని వైఎస్సార్ సీపీ విజయనగరం మండల అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, జిల్లా పెన్షనర్లు, ఉద్యోగుల విభాగం అధ్యక్షుడు డోల మన్మథకుమార్ అన్నారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోరుకొండ గ్రామంలో గురువారం పర్యటించిన వారు ఇంటింటికీ వెళ్లి, కూటమి ప్రభుత్వ మోసాలు వివరించారు. ఎన్నికలకు ముందు లేనిపోని హామీలతో ప్రజలను ఊదరగొట్టి, ఓట్లు వేయించుకున్నారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు అమలు విస్మరించారని విమర్శించారు. రెండు, మూడు పథకాలు అరకొరగా అమలు చేసి, చేతులు దులిపేసుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఆ పథకాల్లోనూ ఎంతోమంది లబ్ధిదారులు నష్టపోయారన్నారు. మహిళలకు ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ తదితర హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. హామీల అమలు, ప్రభుత్వ మోసాలపై ప్రశ్నిస్తే అక్రమంగా కేసులు బనాయించి వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లోనూ అధికారాన్ని ఉపయోగించుకుని, చేసిన అరాచకాలను రాష్ట్ర ప్రజలంతా చూశారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి ప్రజాస్వామ్యబద్ధంగా పాలన కొనసాగడం లేదని, వారి రెడ్బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ఇష్టం వచ్చినట్లు కూటమి నాయకులు ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు.